మనం
కడప | అన్నమయ్య

## విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలి

**– ఉపాధ్యాయులు, విద్యార్థులు వినతి**



పెనగలూరు(సెప్టెంబర్ 21),మనంన్యూస్: పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బడికి వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మూర్తి, విద్యార్థులు టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి కి వినతి పత్రాన్ని ఇచ్చారు. పోలి, హత్యారాల, మందరం ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తారని కానీ ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. బస్సులు ఆపక పోవడం వలన పాఠశాలకు లేటు వస్తున్నామని విద్యార్థులు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు ఇచ్చిన వినతి పత్రాన్ని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు



# ప్రజాభీష్టాన్ని తొక్కిపడతారా?

**ఎంపీడీవో నిర్లక్ష్యంపై గర్జించిన టీడీపీ నాయకులు ! – ప్రజల ఇబ్బందులు పట్టవా?**

**వివాదాస్పద పోలింగ్ బూత్‌ల నివేదికపై నిలదీత**

**స్పందించకుంటే న్యాయపోరాటం తప్పదని నేతల తీవ్ర హెచ్చరిక**








మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 21


ప్రజా సమస్యల పట్ల కొందరు అధికారులు ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిపై టిడిపి ప్రజాప్రతి నిధులు, ప్రజానాయకులు సమరభేరి మోగించారు. ప్రజల సౌకర్యార్థం సూచించిన మార్పులను తుంగలో తొక్కి, ఏకపక్షంగా వ్యవహరించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) తీరుపై తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. ఆకేపాడు పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 51, 52నంబర్ల పోలింగ్ కేంద్రాలు అత్యంత సుదూర ప్రాంతంలో, వివాదాస్పద స్థలాల్లో ఉండటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని గుర్తించి, వాటిని అనువైన ప్రదేశానికి మార్చాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ రాజు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు గతంలోనే ఎంపీడీవోకు స్పష్టమైన వినతిపత్రం సమర్పించారు. అయితే, ప్రజల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని అధికారి.. ప్రజల గొంతును తొక్కిపెట్టి, ఎటువంటి మార్పులు చేయకుండానే యథాతథంగా జడ్పీ సీఈవో కు నివేదిక పంపడం స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. ప్రజాభీష్టాన్ని కాదని నివేదిక ఎలా పంపుతారంటూ టీడీపీ నేతలు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి అధికారిని నేరుగా నిలదీశారు. ప్రజల గొంతును విస్మరిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. నేతల ఒత్తిడికి తలొగ్గిన ఎంపీడీవో, మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నూతన నివేదికను జడ్పీ సీఈవోకు సమర్పిస్తామని స్పష్టం చేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ప్రజలకు అనుకూలంగా పోలింగ్ బూత్‌ల మార్పులు చేపట్టకపోతే ఉన్నతాధికారుల వద్దే కాకుండా, అవసరమైతే కోర్టు గడప తొక్కి న్యాయపోరాటం చేస్తామని నేతలు ఈ సందర్భంగా తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, మాజీ మార్కెట్ చైర్మన్ చమర్తి సురేష్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, సొసైటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ దగ్గుపాటి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ పరుశురాం నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి రాజు, భీమరాజు, సుండు సుధీర్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ పీఠంపై 'శ్వేతారెడ్డి' గురి

**మంత్రి సవితమ్మకు వినతి**

**రాజంపేట చైర్మన్ రేసులో గజ్జల శ్వేతారెడ్డి: ఇన్‌చార్జి మంత్రితో కీలక భేటీ**






మనం ప్రతినిధి రాజంపేట: సెప్టెంబర్ 21: రాజంపేట మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ కౌన్సిలర్ గజ్జల శ్వేతారెడ్డి, రాఘవేంద్రకుమార్ రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవితమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, స్థానిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పాలకమండలి సారథ్య బాధ్యతలను అప్పగించాలని వారు జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. మున్సిపల్ చైర్మన్ పదవిని ఓసీ జనరల్ మహిళ లేదా ఓసీ జనరల్ కేటగిరీల పరిధిలో పరిశీలించి, తమకు సముచిత అవకాశం కల్పించాలని వారు వినతిపత్రంలో స్పష్టంగా విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి, పట్టణ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని, ఈ నేపథ్యంలో అర్హత, సేవా భావాన్ని గుర్తించి పాలక పగ్గాలు అప్పగించాలని నేతలు ఈ సందర్భంగా కోరారు. పట్టణ సమగ్ర రూపురేఖలను మార్చేలా మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించేందుకు సంపూర్ణ ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నట్లు గజ్జల శ్వేతారెడ్డి, రాఘవేంద్రకుమార్ వివరించారు. వార్డుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటామని భరోసా ఇవ్వగా, తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## ఘనంగా వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

**టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి**

**లేబాక శ్రీనివాసులు రెడ్డి**



పెనగలూరు(సెప్టెంబర్ 21),మనంన్యూస్: పెనగలూరు మండలం నల్లపురెడ్డి పల్లి గ్రామం లో నూతనంగా వాటర్ ప్లాంట్ ను ఘనంగా టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి, డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులు రెడ్డి సోమవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులు దాదాపు రూ. 5 లక్షలతో ఈ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్విచ్ ఆన్ చేసి వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వాటర్ ప్లాంట్ లో నూతన టెక్నాలజీ తో రూ. 2 కాయిన్ వేయగానే బిందె నీళ్లు బయట కు వస్తాయని చెప్పారు. నల్లపురెడ్డి పల్లి ప్రజలుకు ఇక పై శుద్ధి నీరు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కుళాయి తిప్పి ప్రజలకు శుద్ధి నీటిని అందించారు. నల్లపురెడ్డి పల్లి లేబాక శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శర వేగంగా అభివృద్ధి చెందుతున్నదని పంచాయతీ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమం లో తాగు నీటి శాఖ ఏఈ సునీత, వాటర్ ప్లాంట్ డీలర్ సానేపల్లి మల్లి కార్జున,పాల్ రెడ్డి, లేబాక రెడ్డయ్య రెడ్డి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, ఆనంద నాయుడు, కోడూరు వెంకటయ్య, చక్రంపేట సురేష్ రెడ్డి, మనోజ్ రెడ్డి, కళాచంద్ర, పుచ్చకాయల లక్ష్మి నరసయ్య, ఓబిలి అమిరుల్లా, కరీముల్లా, శివ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## రూ.85వేలు పలికిన బోయనపల్లి గణేష్ లడ్డు

**వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న కుర్రపాటి అంజి నాయుడు**

**భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం**



రాజంపేట సెప్టెంబరు 19 (మనం న్యూస్) వినాయక చవితి పండుగ పురస్కరించుకుని బోయనపల్లి గ్రామంలో శ్రీ రామ్ గుడి దగ్గర ఏర్పాటు చేసిన గణనాథునికి కమిటీ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎనిమిదో రోజు సోమవారం గణేష్ నిమజ్జనం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి లడ్డు పాట వేలంపాట నిర్వహించగా 85000 రూపాయలకు కుర్రపాటి అంజి నాయుడు దక్కించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా భక్తులు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం వినాయక స్వామి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత, మహిళలు, చిన్నారులు రంగులు చల్లు కుంటూ, బాణసంచా కాలుస్తూ, వినాయక భజనలతో సందడి చేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.డీజే పాటల నడుమ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.



## కోలాహలంగా వినాయక చవితి వేడుకలు

**అల్పాహార విందులో పాల్గొని భక్తులకు అల్పాహారం వడ్డించిన యల్లటూరు శ్రీనివాసరాజు**





మనం న్యూస్ రాజంపేట సెప్టెంబర్ 21: రాజంపేట పట్టణంలోని అగ్రహారంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు బిజెపి జోనల్ నాయకులు సాయి లోకేష్ పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజల కోసం జనసేన నాయకుడు కొండేటి రవి కుమార్ మరియు వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అల్పాహార విందులో పాల్గొని స్వయంగా భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆత్మీయంగా మమేకమై, వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అగ్రహారంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం భక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు యల్లటూరు శివరామరాజు, రామయ్య, చల్లా సుధాకర్, తిమ్మసముద్రం కృష్ణదీప్, పివిఆర్ కుమార్, పిచ్చయ్య నాయుడు, నరసయ్య, మౌలా, అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





# అగ్ని ప్రమాద బాధితులకు అన్నివిధాల అండగా ఉంటాం

**మాజీ శాసనసభ్యులు కొరుముట్ల**

చిట్వేలీ సెప్టెంబర్ 21మనం న్యూస్: చిట్వేలి పట్టణంలోని సింగమాల వీధి నందు నివాసం ఉంటున్న టంగుటూరి ప్రసాద్ పూరి గుడిసె ఇటీవల కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో అగ్నికి అహుతి అయ్యి సర్వం కోల్పోవడంతో సోమవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తిరును, వారిని అడిగి తెలుసుకొని అన్ని విధాల అండగా ఉంటామని వైయస్సార్సీపి మాజీ శాసనసభ్యులు కోరుముట్ల శ్రీనివాసులు హామీ ఇచ్చారు. అనంతరం అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోరుముట్ల మాట్లాడుతూ భవిష్యత్తులో వారు నిర్మించుకునే గృహానికి కూడా సహాయ సహకారాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి చిట్వేలి మాజీ ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాదినేని వెంకట్ రెడ్డి, బసిరెడ్డి రమణారెడ్డి, దోనెల ప్రతాప్ యాదవ్, స్టేట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లింగం లక్ష్మీకర్, పట్టణ అధ్యక్షుడు హజరత్ రెడ్డి, యూత్ సభ్యులు నవీన్, పగడాల గణేష్, సుబ్బు, తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వీఆర్ఏల నిరసన కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు



ముద్దనూరు,సెప్టెంబర్,21, మనం న్యూస్: తహసిల్దార్ కార్యాలయ భవనం ఎదుట గత ఆరు రోజులుగా వీఆర్ఏలు నిరసన దీక్ష చేపట్టి వినూత్న పద్ధతులలో ప్రతిరోజు నిరాహా దీక్షలు చేపడుతున్నారు. వారికి మద్దతుగా సోమవారం గ్రామాల రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న నిరాహాదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను శక్తికి మించి విధులు చేపించుకొని తగిన వేతనం ఇవ్వలేదని మరిన్ని సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి ఫలితం లేకపోవడంతోనే దీక్షలు చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలపై దృష్టి సారించి వారి సామరస్యమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకుంటే రాబోయే కాలంలో మరిన్ని దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ సురేష్, నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీ నారాయణ, కడప జిల్లా అధ్యక్షులు శేఖర్, ముద్దనూరు చాపాడు, మైలవరం, కమలాపురం, దువ్వూరు, మండల జేఏసీ నాయకులు, మండల గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్**



చిట్వేలీ సెప్టెంబర్ 21 మనం న్యూస్: మండల పరిధిలోని భూ సమస్యలు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, ఉచిత పంటల బీమా తదితర రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల తహసిల్దార్ నరసింహారావు కి రైతులతో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం పందికాళ్ళ మణి మాట్లాడుతూ మండల పరిధిలోని భూ సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, మరియు ఎరువులకు రకరకాల యాప్ లు వలన రైతులు ఎరువులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రైతులకు భూములు ఉన్న ఈ కేవైసీ అని, వేలిముద్రలు అని, ఆధార్ కార్డు లింక్ లేదని, ఇలా రకరకాల కారణాలతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సంక్షేమ పథకాలు రైతులకు అందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నామన్నారు.






# ఘనంగా అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**- టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి**
**- లేబాక శ్రీనివాసులు రెడ్డి**

పెనగలూరు(సెప్టెంబర్ 21),మనంన్యూస్: పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి, డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులు రెడ్డి లు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచరణ లతో లేబాక శ్రీనివాసులు రెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ లేబాక రాజమ్మ లు భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ నిధులు రూ. 40 లక్షలతో ఈ ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్ రెడ్డి, లేబాక రెడ్డయ్య రెడ్డి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, ఆనంద నాయుడు, కోడూరు వెంకటయ్య, చక్రంపేట సురేష్ రెడ్డి, మనోజ్ రెడ్డి, కళాచంద్ర, పుచ్చకాయల లక్ష్మి నరసయ్య, ఓబిలి అమిరుల్లా, కరీముల్లా, శివ పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, సెప్టెంబర్, 21 మనం న్యూస్

ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో పెండెన్సీ పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే జాప్యానికి తావు లేకుండా తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అలా పరిష్కరించి నప్పుడే ప్రజల్లో అర్జీల పరిష్కారం పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో, నాణ్యతతో పరిష్కరించడంతో పాటు అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీ తిరిగి ఓపెన్ కాకుండా సంబంధిత అధికారి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. సంబంధిత అధికారి, ఫిర్యాదు దారులకు సరైన విధంగా స్పష్టంగా సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, జాన్ ఇర్విన్, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, జిల్లా సహకార శాఖాధికారి వెంకట సుబ్బయ్య, జిల్లా ఉపాది కల్పనాధికారి సురేష్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు తదతరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ వర్కర్ల కుటుంబాలకు పథకాలు వర్తింపచేయాలి

సిద్ధవటం, సెప్టెంబర్ 21 (మనం న్యూస్ ): అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెబుతున్న ప్రభుత్వం.. వారికి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు లభించే సామాజిక భద్రత సదుపాయాలు కూడా లేకపోవడం ఎంతవరకు న్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి ప్రశ్నించారు. సోమవారం మండలంలోని భాకరాపేట గ్రామంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో వర్కర్లు, హెల్పర్లు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ వారి కుటుంబాలకు సరైన సామాజిక భద్రత లేకపోవడం ఆందోళనకరమన్నారు.అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల కుటుంబాల్లో ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి వృద్ధాప్య, వికలాంగ, వితంతు, ఒంటరి మహిళల పింఛన్లు పొందేందుకు ప్రత్యేక అర్హత కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడీ సిబ్బంది సేవలను ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ సిబ్బంది కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఇలాంటి నిబంధనలు విధించలేదని రాజేశ్వరి రెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల కుటుంబాల్లో అర్హులైన వారికి పింఛన్లు అందేలా



ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ సిబ్బంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారని అన్నారు. అలాంటి సిబ్బంది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏకుల రాజేశ్వరి రెడ్డి కోరారు.

## ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగుజాడ 'గురజాడ'



కడప సెప్టెంబర్ 21(మనం న్యూస్) ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగు జాడ గురజాడ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సోమవారం ప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు 165వ జయంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆ తర్వాత డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ హేతువాది అయిన గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఆయన ఒకరని అన్నారు. 19వ శతాబ్దంలోను, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ ఆయన చేసిన రచనలు సామాజిక దర్పణాలని, అందువల్లనే ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని 19వ శతాబ్దం చివరలోనే గుర్తించిన దార్శనికుడైన రచయిత గురజాడ అని అన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. అభ్యుదయ కవితా పితామహుడుగా పేరొందిన గురజాడ ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. ముత్యాల సరాలు అనే ఛందస్సును సృష్టించి, అనేక రచనలు ఆ ఛందస్సులోనే చేశారన్నారు. ఆయన రాసిన దేశభక్తి గేయం చాలా విశిష్టమైందన్నారు. తెలుగులో చిన్నకథకు తొలిరూపు ఇచ్చిన ఘనత ఆయనదే అన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది, పాఠకులు కృష్ణమూర్తి, గంగన్న యాదవ్ పాల్గొన్నారు.

## అదనపు వరకట్నం కోసం భార్యపై దాడి

**చంపడానికి కూడా వెనకాడ లేదన్న బాధితురాలు**

ముద్దనూరు సెప్టెంబర్ 21 మనం న్యూస్ :వరకట్నం కోసం భార్యను వేధిస్తున్న కేసులో పోలీసుల సమక్షంలో రాజీ పడి, భార్యను బాగా చూసుకుంటానని నమ్మించి తీసుకెళ్తూ మార్గమధ్యంలోనే ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన దారుణ సంఘటన ముద్దనూరు మండలంలో వెలుగుచూసింది.

ముద్దనూరు మండలం నల్లభల్లె గ్రామానికి చెందిన ఉదయ్ కి ఏడాదిన్నర క్రితం ధర్మల్ గ్రామానికి చెందిన ఓ మహిళతో ప్రేమాయణం అనంతరం వివాహం చేసుకున్నాడు. 8 నెలల పాప పుట్టిన తర్వాత అప్పుడప్పుడు మానసికంగా శారీరకంగా వేధిస్తూ వరకట్నం తీసుకురావాలని దాడి చేస్తూ ఉండేవాడని బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించగా భర్త, భార్యకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇరువురికి పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ చేశారు. సోమవారం భార్యాభర్తలను ఇరువురిని రాజీ అనంతరం భర్త నల్లబెల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో భార్యపై దాడికి పాల్పడినట్లు బాధిత మహిళ పేర్కొన్నారు. మహిళపై మార్గమధ్యంలో దాడి చేయడంతో మహిళ కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ఉదయ్ బారి నుంచి బాధిత మహిళను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.